క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం

తిరుమలాయపాలెం: మండలంలోని ఎర్రగడ్డలో జ్వరాల తీవ్రత నేపథ్యాన తిరుమలాయపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యాన మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అలివేలు జ్వర బాధితులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏఎన్‌ఎం విజయలక్ష్మి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఇంటి నంబర్ల నమోదు ప్రారంభం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 8వ డివిజన్, వైఎస్‌ఆర్ నగర్‌లో కొత్త ఇంటి నంబర్ నమోదు కార్యక్రమానికి ప్రత్యేక కౌంటర్‌ను మంగళవారం ఏర్పాటు చేశారు. స్థానిక డివిజన్ కార్పొరేటర్ లకావత్ సైదులు ఈ కార్యక్రమాన్ని సమీక్షించి డివిజన్ ప్రజలను ఇబ్బంది పెట్టకుండా ఇంటి నంబర్ నమోదు పారదర్శకంగా జరగాలని కోరారు.

నియామకం

నేలకొండపల్లి: చెరువుమాధారం లిఫ్టు పరిధిలోని అప్పలనరసింహాపురం, రాయగూడెం, చెరువుమాధారం, కట్టుకాచారాం, కొంగర, వల్లభి గ్రామాలకు చెందిన రైతులు మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి పాలక వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లిఫ్టు ఇరిగేషన్ చైర్మన్‌గా యలగాల భూషయ్య, డైరెక్టర్లుగా కొండపల్లి శేషయ్య, శీలం అప్పారావు, దారమళ్ల రాజు, బొమ్మకంటి నారాయణ, తీగ కొండలు, నంబూరి నరేష్, డేగల రోశయ్య, బోయిన కృష్ణయ్య, జిడుగు రమేష్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జానకిరామయ్య, మాజీ ఎంపీపీ తీగ వెంకటేశ్వర్లు, తీగ రమణయ్య, బోయిన వేణు, తీగ రాములు, బోయిన వేణునాథం, మన్నె నగేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కూసుమంచి: ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారిపై జుజుల్‌రావుపేట సమీపాన మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఖమ్మం నగరానికి చెందిన పూర్ణాచారి తన ద్విచక్రవాహనంపై ఖమ్మం వెళ్తుండగా ప్రమాదవశాత్తు వాహనం అదుపుతప్పి కిందపడి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

జరిమానా

ఖమ్మంక్రైం: ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా నగరంలో ఓ మైనర్ బాలుడితో ద్విచక్ర వాహనాన్ని నడిపించి హల్చల్ చేయించిన 53వ వార్డు కార్పొరేషన్ జవాన్ పృథ్వీకి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం అతడికి కౌన్సిలింగ్ ఇచ్చి ఇలాంటి ఘటనలు పునరావృతం కావొద్దని హెచ్చరించారు.

పరిశుభ్రత ముఖ్యం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్స్ ఆధ్వర్యాన పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ బిక్కుమళ్ల అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా చెట్ల వద్ద విద్యార్థులు శుభ్రం చేశారు.

విద్యార్థులకు షూస్ వితరణ

ఖమ్మంఅర్బన్: నగరంలోని 14వ డివిజన్ గొల్లగూడెం వెలుగుమట్ల పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఎర్రబోయిన వెంకట్ రూ.20 వేల విలువైన షూస్ వితరణగా అందించారు. కార్పొరేటర్ కూరాకుల వలరాజు ఆధ్వర్యాన వీటిని అందించగా.. దాతలను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ కొర్లపాటి ధనలక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం నిర్మల్‌కుమారి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, కృపాకర్, జానివియా, షేక్ దస్తగీర్, మునీర్, మంగమ్మ, శాంతి, ప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కూసుమంచి: మండలంలోని జీళ్లచెరువు గ్రామానికి చెందిన గోపి మహేష్ అనే యువకుడి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. అతడి కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా అదే గ్రామానికి చెందిన ఐతగాని రాఘవగౌడ్ మంగళవారం రూ.5వేల ఆర్థిక సాయాన్ని కుటుంబసభ్యులకు అందించగా.. దాతకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఫ్యాన్ బహూకరణ

తిరుమలాయపాలెం: మండలంలోని హస్నాబాద్ అంగన్‌వాడీ కేంద్రానికి గ్రామ బీఆర్‌ఎస్ కార్యదర్శి కాశీమల్ల మహేంద్రనాథ్ సీలింగ్ ఫ్యాన్‌ను మంగళవారం బహూకరించారు. పిలలకు సౌకర్యం కోసం ఈ వితరణ చేసినట్లు ఆయన తెలిపారు. నాయకులు పాల వెంకన్న, సత్తిబాబు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

ఖమ్మంరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని న్యూడెమోక్రసీ మాస్‌లైన్ పాలేరు డివిజన్ కార్యదర్శి బి.వెంకయ్య కోరారు. ఈ మేరకు మంగళవారం కాచిరాజుగూడెంలో జరిగిన కార్యక్రమంలో గోడపత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాధవరావు, శ్రీనివాస్, వెంకటరాములు, వెంకటేశ్వర్లు, కోటయ్య, అంజయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

యార్డు.. వెరీ బ్యాడ్!



దంపింగ్ యార్డులో దారికి అడ్డంగా పోసిన వ్యర్థాలను పరిశీలిస్తున్న అధికారులు

దశాబ్దాలుగా ఒకే డంపింగ్ యార్డు వాడకం

- పేరుకుపోయిన వ్యర్థాలతో మునుకుపోయిన దారి
- నిలిచిన చెత్త సేకరణ
- దారి కల్పించేదాక చెత్త సేకరణ చేయమంటూ డ్రైవర్ల నిరసన
- జేసీబీలతో శుభ్రం చేయించిన కేఎంసీ అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థకు డంపింగ్ యార్డ్ పెద్ద సమస్యగా మారింది. దశాబ్దాల కాలం నుంచి ఒకే యార్డ్ వినియోగిస్తుండడంతో అందులో వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోయాయి. ఎంతలా అంటే కనీసం లోపలకు వెళ్లేందుకు దారి కూడా లేనంత. దీంతో ట్రాక్టర్ డ్రైవర్లు లోపలికి వెళ్లేందుకు దారి లేదంటూ మంగళవారం చెత్త సేకరణను నిలిపివేసి నిరసన తెలిపారు. వాహనాలు లోపలకు వెళ్లేలా చేస్తేనే చెత్త సేకరణ చేపడతామంటూ అధికారులు ఎదుట వాపోయారు. ఈనేపథ్యాన కేఎంసీ అధికారులు ఒక్కసారిగా అలెర్ట్ అయి.. శానిటరీ సూపర్‌వైజర్ ద్వారా డ్రైవర్లతో మాట్లాడి దారి కల్పిస్తామని, చెత్త సేకరణ చేపట్టాలని కోరారు.

అంతర్గత రోడ్డు లేక..

నగరంలోని 60 డివిజన్ల పరిధిలో ప్రతీ రోజు ట్రాక్టర్లు, స్వచ్ఛ ఆటోల ద్వారా ఇంటింటి చెత్త సేకరణ చేపట్టి.. 180 మెట్రిక్ టన్నుల వరకూ డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో యార్డు లోపలకు వెళ్లే మార్గం అంతా గుంతల మయం అవడంతో ఆయా ఆటోలు దిగబడి డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ట్రాక్టర్లను లోపల వరకు వెళ్లి చెత్త పోసేలా కేఎంసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే ఆటో డ్రైవర్లు మాత్రం లోపలకు వెళ్లకుండా యార్డులోని దారి వెంటే వ్యర్థాలను పోస్తున్నారు. దీంతో దారి మొత్తం వ్యర్థాల కుప్పలతో మూసుకుపోయింది.

చెత్త సేకరణ నిలిపివేత..

ఆటోలలో సేకరించిన వ్యర్థాలను దారి వెంటే పోయడంతో ట్రాక్టర్లు కూడా లోపలకు వెళ్లే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో మంగళవారం ట్రాక్టర్ డ్రైవర్లు చెత్త సేకరణ చేపట్టకుండా వాహనాలను కార్పొరేషన్ కార్యాలయం వద్దే నిలిపివేశారు. డివిజన్లలోకి ట్రాక్టర్లను తీసుకెళ్లలేదు. దీంతో శానిటరీ అధికారులు స్పందించి డ్రైవర్లతో చర్చలు జరిపారు. జేసీబీలతో డంపింగ్‌యార్డ్ లోపల దారికి అడ్డంగా ఉన్న వ్యర్థాలను పక్కకు తొలగిస్తామని, వెంటనే చెత్త సేకరణ చేపట్టాలని సూచించారు. మార్గం అంతా శుభ్రం అయిన తర్వాతే చెత్త సేకరణ చేపడతామని తేల్చి చెప్పడంతో అధికారులు హుటాహుటిన ఆ వ్యర్థాలను పక్కకు నెట్టించి, చెత్త సేకరణను ప్రారంభించారు. అయితే డంపింగ్‌యార్డ్‌కు శాశ్వత పరిష్కారం చూపించాలని కార్మికులు కోరుతున్నారు.



ట్రాక్టర్ల డ్రైవర్లతో మాట్లాడుతున్న అధికారులు

ప్రజలకు సేవ చేయడమే నా లక్ష్యం

- రేపు వైరాకు పెద్దఎత్తున తరలిరావాలి
- నియోజకవర్గ స్థాయి సమావేశంలో మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: ఉమ్మడి జిల్లా ప్రజలకు వీలైనంత మేర సేవచేయడమే తన జీవిత లక్ష్యం తప్ప పదవుల కోసం పాకులాడలేదని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం వీడియోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. వైరాలో గురువారం జరిగే సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నందున నియోజకవర్గం నుండి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, రైతులు తరలిరావాలని కోరారు. అదేరోజు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయడంతో పాటు సీతారామ ప్రాజెక్టు పంప్‌హౌస్‌లను ప్రారంభిస్తారన్నారు. కాగా, తన 45ఏళ్ల రాజకీయ జీవితంలో ఉమ్మడి జిల్లాకు అనేక సాగునీటి ప్రాజెక్టులు తీసుకొచ్చానని.. ఇప్పుడు గోదావరి జలాలను ఒడిసిపట్టి పొలాలకు చేర్చడమే లక్ష్యంగా సీతారామ ప్రాజెక్టును పూర్తిచేయాలనే తపనతో ఉన్నానని తెలిపారు. అనంతరం కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్, మేయర్ నీరజ, కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, మాజీ కార్పొరేటర్ నాగండ్ల దీపక్‌చౌదరి మాట్లాడారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావుతోపాటు ఫాతిమా జోహర, బాలసాని లక్ష్మీనారాయణ, నల్లమల వెంకటేశ్వరరావు, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, ఎర్రం బాలగంగాధర తిలక్, కొత్తా సీతారాములు తదితరులు పాల్గొన్నారు. కాగా, సీఎం సభను విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మంగళవారం సంజీవరెడ్డిభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో పోట్ల నాగేశ్వరరావు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, పుచ్చకాయల వీరభద్రం, మొక్కా శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

కుల గణనతోనే బీసీల సమస్యలకు పరిష్కారం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: దేశంలో ఆర్థిక, అసమానతలు పోవాలన్నా, అట్టడుగు వర్గాల జీవితాల్లో అభివృద్ధి తేవాలన్నా దేశ వ్యాప్తంగా కులగణన నిర్వహించడం ఒక్కటే మార్గమని బీసీ సంఘాల నేతలు అన్నారు. మంగళవారం ఖమ్మం శ్రీశ్రీ సర్కిల్‌లో గల మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహం ఎదుట జూలూరు గౌరిశంకర్ రచించిన 'మావాటా మాకే 'అనే పుస్తకాన్ని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ ఆధ్వర్యాన మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఆర్‌జేసీ విద్యా సంస్థల అధినేత గుండాల కృష్ణ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమాచారి, లిక్కి కృష్ణారావు బీసీ మేధావులతో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల ముందే బీసీ జనగణన చేపట్టాలన్నారు. త్వరలో చేపట్టబోయే నామినేటెడ్ పదవులకు బీసీలకు ఎక్కువ అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుల్లారావు, సుగుణ, కృష్ణ,బాలకృష్ణ, వెంకటాచారి, కమలాకర్, కరుణితేజ, ఉమామేశ్వరచారి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలి

కూసుమంచి: రైతులు తమ వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని ట్రాన్స్‌కో డీఈఈ నాగేశ్వరరావు సూచించారు. రైతు పొలంబాట కార్యక్రమంలోభాగంగా మంగళవారం మండలంలోని గట్టుసింగారం గ్రామంలో ఆయన సిబ్బందితో కలిసి వ్యవసాయ బావులను సందర్శించి రైతుల విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పొలం బాట కార్యక్రమం ద్వారా రైతుల విద్యుత్ సరఫరా సమస్యలు పరిష్కరించడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్‌ల చుట్టూ ఉన్న కంప చెట్లను తొలగించి శుభ్రం చేయడం వంటి పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ కోక్యా నాయక్, ఏఈ సృజన, మాజీ ఎంపీటీసీ వాకా సుధారాణి, మాజీ ఉప సర్పంచ్ రెడ్డె బోయిన సింహాద్రి, రైతులు పాల్గొన్నారు.

'రెజొనెన్స్ శ్రీనగర్'లో మాక్ పోలింగ్



కార్యక్రమంలో కార్పొరేటర్ నీరజ, పాఠశాల డైరెక్టర్లు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని శ్రీనగర్‌కాలనీలోని రెజొనెన్స్ పాఠశాలలో మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కృష్ణవేణిలు మాట్లాడుతూ ఎన్నికలను విధానాలను పరిచయం చేస్తూ వారిలో ఎన్నికల పట్ల అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించామన్నారు. నాయకులుగా ఎంపికైన సాయి చరణ్, చరిత తదితరులను యాజమాన్యంతో పాటు సీఐ భానుప్రకాష్, 13వ డివిజన్ కార్పొరేటర్ కొత్తపల్లి నీరజ పాల్గొని అభినందించారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళన

తిరుమలాయపాలెం: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్మికులు మండల ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఎంఈఓ ఎం.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ వీరన్న మాట్లాడుతూ.. రెక్కాడితేనే డొక్కాడని మధ్యాహ్న భోజన కార్మికులు.. విధులు నిర్వర్తిస్తూనే భోజన తయారీకి కావాల్సిన సరుకులను అప్పు తెచ్చి తీసుకొస్తున్నారని చెప్పారు. అయినా నెలల తరబడి బిల్లులు చెల్లించపోవడంతో సంబంధిత అధికారిని అడిగినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కార్మికులకు రూ.10వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల మండల అధ్యక్షురాలు నాయని పద్మ, సుంచు ఉపేంద్ర, ఉప్పమ్మ, జ్యోతి, భద్రమ్మ, మంగమ్మ, సాగరిక, వెంకటమ్మ, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఎంఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన వర్కర్లు

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

ఖమ్మంలీగల్: విద్యార్థులు బాల్య దశ నుంచే వారి కలలను సాకారం చేసుకుని ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మల్లెబోయిన వలరాజు అన్నారు. మంగళవారం నగరంలోని గిరిజన బాలుర వసతి గృహంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌లకు పాల్పడితే నిర్భయ చట్టం కింద కేసులు పెడతారని, మాదక ద్రవ్యాలకు బానిసలు కావొద్దని సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ తరఫున అట్టడుగు వర్గాల వారికి, పేదలకు ఉచిత న్యాయ సాయం అందిస్తామని తెలిపారు. వసతిగృహ పర్యవేక్షణాధికారి ఎల్.బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ జెండాల పంపిణీ

ఖమ్మం మామిళ్లగూడెం/ఖమ్మంఅర్బన్: హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఖమ్మంలోని నిజాంపేటలో జాతీయ జెండాలను బీజేపీ రాష్ట్ర నాయకుడు గెంటెల విద్యాసాగర్ ఆవిష్కరించి, ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చింతమళ్ల వీరస్వామి, కుమ్మరి హనుమంతు తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని రోటరీనగర్ ప్రభుత్వ పాఠశాలలో బీజేపీ ఖమ్మంఅర్బన్ టౌన్ అధ్యక్షుడు కుమిలి శ్రీనివాసరావు ఆధ్వర్యాన 500 జాతీయ జెండాలను విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, నాయకులు కంపసాటి అంజన్న, నీలిమ సురేష్, సీతారాములు, సాంబశివరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

విష జ్వరాల నివారణకు కృషి చేయాలి

తిరుమలాయపాలెం/నేలకొండపల్లి: గ్రామాల్లో విజృంభిస్తున్న విష జ్వరాలను నివారించేందుకు వైద్య అధికారులు చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ మండల నాయకుడు తిమ్మిడి హన్మంతరావు డిమాండ్ చేశారు. మంగళవారం తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు ఆస్పత్రిలో వైద్య సిబ్బందికి వినతి పత్రం అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టకే జ్వరాల బారిన పడుతున్నారని, ఇకనైనా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాలలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే నేలకొండపల్లి మండలంలోని అనాసాగారం, సుర్దేపల్లి, అమ్మగూడెం, సదాశివాపురం, కొత్తకొత్తూరు గ్రామాల్లో జ్వర బాధితులు రోజురోజుకు పెరుగుతుండడంతో మంగళవారం దాదాపు 350 మంది ఓపీ పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి కె.రాజేష్ తెలిపారు.

సమస్యల విన్నపానికి అనుమతి ఇవ్వాలి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం జిల్లా కేంద్రంగా జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు, విద్యారంగ సమస్యలపై విన్నవించేందుకు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేలా అనుమతి ఇవ్వాలని కోరుతూ పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యాన మంగళవారం నగరంలో విద్యార్థులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.వెంకటేష్, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు జాటోత్ ప్రేమ్‌సింగ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని, జిల్లాలోని జేఎన్‌టీయూహెచ్, మెడికల్–నర్సింగ్ కళాశాలల భవనాల నిర్మాణ పనులు ప్రారంభించాలని, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, తదితర సమస్యలను విన్నవించనున్నట్లు తెలిపారు. సమయం ఇవ్వకుంటే పర్యటనను అడ్డుకుంటామన్నారు. పీవైఎల్ రాష్ట్ర నాయకులు మందా సురేష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, జిల్లా నాయకులు శ్రీను, లక్ష్మణ్, సంధ్య, ప్రియాంక, అనూష, అక్బర్, యూన్నీ, జాన్‌పాషా పాల్గొన్నారు.

ఎంపీ రేణుకాచౌదరి జన్మదిన వేడుకలు



అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ రఫీదా బేగం ముస్తఫా



ఖమ్మంఅర్బన్: మదర్‌థెరిస్సా ఆశ్రమంలో కేక్ కట్ చేస్తున్న రాధాకిషోర్

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంఅర్బన్/ఖమ్మంవన్‌టౌన్: కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి జన్మదిన వేడుకలను నగరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 57వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ.రఫీదా బేగం ముస్తఫా ఆధ్వర్యాన కేక్ కట్ చేశారు. ఆతర్వాత రాపర్తినగర్‌లోని మానసిక దివ్యాంగుల కేంద్రం, కరుణగిరిలోని వృద్ధాశ్రమంలో అన్నదానం చేయడమే కాక ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు పాల్గొన్నారు. అలాగే, మార్కెట్ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్ ఆధ్వర్యాన పలుచోట్ల కేక్ కట్ చేయడంతో పాటు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్పొరేటర్ మలీదు జగన్, నాయకులు పాల్గొన్నారు. కాగా, ఎంపీ రేణుకాచౌదరి పుట్టిన రోజు సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు రాష్ట్రపతి కార్యాలయం నుంచి ప్రకటన విడుదలైంది.

నేడు ఎగ్జిట్, ఎంట్రీ కోసం నిరసన దీక్ష

నేలకొండపల్లి: కోదాడ–ఖమ్మం జాతీయ రహదారిలో భాగంగా మండల కేంద్రానికి ఎగ్జిట్, ఎంట్రీ ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ సామాజిక కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్ నేడు(బుధవారం) నిరసన దీక్ష చేపట్టనున్నట్లు ప్రకటించారు. మంగళవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బౌద్ధక్షేత్రం, రామదాసు మందిరానికి పర్యాటకులు, భక్తులు దేశ, విదేశాల నుంచి వస్తున్న నేపథ్యాన వారి ఇబ్బందులు దృష్ట్యా నేషనల్ హైవే అధికారులు ఎంట్రీ, ఎగ్జిట్ ఇవ్వాలని కోరారు.

రేపు సినీ సంగీత విభావరి

ఖమ్మంగాంధీచౌక్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఈ నెల 15న స్వర మాధురి కల్చరల్ యూనిట్ ఆధ్వర్యాన సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కల్చరల్ యూనిట్ అధ్యక్షుడు ఆదిరాజు పురుషోత్తమరావు తెలిపారు. మంగళవారం ఖమ్మంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కళాభిమానులు, కళాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కల్చరల్ యూనిట్ ప్రతినిధులు జల్లా లక్ష్మీనారాయణ, ఆకుల గణపతిరావు, గద్దల కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

17న దరఖాస్తుల పరిశీలన

ఖమ్మంమయూరిసెంటర్: ట్రైకార్ కార్పొరేషన్ ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు, వయోవృద్ధుల దరఖాస్తులను, వారి ధ్రువపత్రాలను ఈ నెల 17న పరిశీలించనున్నట్లు కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ సంపత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రుణాల మంజూరు కోసం ఎంపికలు ఉంటాయని తెలిపారు.

కమిషనర్‌కు వినతి

ఖమ్మంమయూరిసెంటర్: తాము చేసిన పనులకు సంబంధించిన బిల్లులను చెల్లించాలని కోరుతూ మున్సిపల్ కాంట్రాక్టర్లు మంగళవారం కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యను కలిసి వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి రూ.1.12 కోట్లు బిల్లులు,నగర అభివృద్ధికి సంబంధించిన బిల్లులు రావాల్సి ఉన్నాయని కాంట్రాక్టర్ల సంఘం బాధ్యుడు పసుపులేటి వెంకటేశ్వర్లు కమిషనర్‌కు వివరించారు. వారం రోజుల్లో బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుంటానని కమిషనర్ హామీ ఇచ్చినట్లు వెంకటేశ్వర్లు వెల్లడించారు. కాంట్రాక్టర్లు శ్రీధర్, కిషోర్, జోగల కిషోర్, సతీష్ తదితరులు ఉన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

తిరుమలాయపాలెం: డ్వాక్రా సంఘాల మహిళలు ప్రభుత్వం అందిస్తున్న రుణ సాయంతో ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎంపీడీఓ సిలార్‌సాహెబ్ అన్నారు. మంగళవారం మండలంలోని పిండిప్రోలులో జ్యోతి గ్రూప్‌కు చెందిన పిడతల శిరీష సీఐఎఫ్ ద్వారా రూ.15వేలతో ఏర్పాటు చేసిన ఫ్యాన్సీ బ్యూటీ పార్లర్ మహిళా శక్తి యూనిట్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రుణ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల ఏపీఎం అలివేలు మంగ, సీసీలు బండ్ల నాగేశ్వరరావు, సావిత్రి, రవి, జైపాల్, గ్రామ దీపిక ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి కె.రవికుమార్ తనిఖీ చేశారు. తొలుత మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణను పరిశీలించి నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే ప్రాధాన్యతను వివరించారు. అనంతరం పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి చలపతిరావు, ప్రధానోపాధ్యాయులు రమేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపాలెం మండలంలో..

రఘునాథపాలెం: మండలంలోని పలు పాఠశాలలను మంగళవారం ఎంఈఓ భూక్యా రాములు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంచుకొండ పాఠశాలను సందర్శించి చదువులో విద్యార్థుల నైపుణ్యతను సమీక్షించి, సమస్యలపై ఆరా తీశారు. పుటానితండా గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాలను సందర్శించగా.. అక్కడ సమస్యలతో పాటు టీచర్ కొరత, మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనం పెట్టడం లేదని, అమ్మ ఆదర్శ ప్రోగ్రాం కింద పూర్తి చేయని పనుల గురించి స్థానికులు ఎంఈఓకు ఫిర్యాదు చేశారు.

కవికి పురస్కారం

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ సారస్వత పరిషత్ ఏటా ప్రదానం చేసే డాక్టర్ దేవులపల్లి రామానుజరావు పురస్కారానికి ప్రముఖ కవి, విమర్శకుడు డాక్టర్ ఆర్.సీతారాం ఎంపికయ్యారు. ప్రస్తుతం నగరంలోని ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న ఆయన 'ఇదిగో ఇక్కడిదాకే,''సన్నాఫ్ మాణిక్యం', 'కుప్పం కవితలు'వంటి కవితా సంపుటాలు, 'అదే పూట'మొదలైన విమర్శ వ్యాస సంపుటాలు, పరిశోధన గ్రంథాలు వెలువరించారు. ఈ నెల 24న జరిగే సభలో హైకోర్టు న్యాయమూర్తి కె.లక్ష్మణ్ ముఖ్య అతిథిగా పాల్గొని రూ.25వేల నగదు, ప్రశంసా పత్రం, జ్ఞాపిక, శాలువాతో సత్కరిస్తారని పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య మంగళవారం తనకు తెలిపారని సీతారాం తెలిపారు.

'న్యూ ఇరా' విద్యార్థి ప్రతిభ

ఖమ్మం సహకారనగర్: ఇటీవల కోయంబత్తూర్‌లో రోలర్ స్కేటింగ్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఓపెన్ నేషనల్ చాంపియన్ షిప్ ఇండియా స్కేట్ -2024లో తమ పాఠశాల విద్యార్థి ఫైనల్స్‌లో ద్వితీయ స్థానంలో నిలిచాడని న్యూ ఇరా పాఠశాల డైరెక్టర్ పి.భూమేశ్వరరావు తెలిపారు. 4వ తరగతి విద్యార్థి వివాన్ శ్రేయస్ అండర్ 7–9 కేటగిరిలో వెయ్యి మీటర్ల విభాగం ఫైనల్స్‌లో ద్వితీయ స్థానం సాధించడం అభినందనీయమన్నారు.

విద్యతోనే భవిష్యత్



విద్యార్థినికి చెక్కు అందిస్తున్న దృశ్యం

కామేపల్లి: విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ కలుగుతుందని కొమ్మినేపల్లి శ్రీవేంకటేశ్వర ఫెర్టిలైజర్స్ నిర్వాహకుడు కాలం ఉపేందర్‌రెడ్డి అన్నారు. మంగలవారం కొమ్మినేపల్లి హైస్కూల్‌లో పదో తరగతి 10 మంది విద్యార్థులకు రూ.2500లు చొప్పున చెక్కులను అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పేద విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నగదు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జ్యోతి, మాజీ సర్పంచ్ మూడ్ కృష్ణప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి



నినాదాలు చేస్తున్న కాలనీవాసులు

ఖమ్మంఅర్బన్: నవోదయ కాలనీవాసులపై అధికారుల కక్ష సాధింపు చర్యలు మారుకుని, హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం నీరు, కరెంట్ సౌకర్యం కల్పించాలని నగరంలోని వెలుగుమట్ల గుట్టపై ఉన్న నవోదయ కాలనీవాసులు వేడుకుంటున్నారు. మంగళవారం తమకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని నినాదాలు చేశారు. కరెంట్ కోసం తీసుకొచ్చిన వైర్లను ఇటీవల అధికారులు కట్ చేసి తీసుకెళ్లడంతో.. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నది కరెంట్ అధికారులా.. లేక రియల్ ఎస్టేట్ దొంగలా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు కనీస సౌకర్యాలు కల్పించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం జిల్లా కార్యదర్శి కల్తీ రామచంద్రయ్య, ఓపీడీఆర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దండా లింగయ్య, ఖమ్మం జిల్లా కార్యదర్శి బాణాల లక్ష్మణాచారి, కాలనీ వాసులు పాల్గొన్నారు.